సాక్షి
నిర్మల్
గురువారం ◆ 26 ◆ జనవరి ◆ 2023



ముగిసిన బేతల్ పూజలు

ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయంలో బుధవారం బేతల్ పూజలు నిర్వహించారు. అనంతరం మెస్రం వంశీయులు నాగోబాకు పూజలు చేశారు. 8లో▸



పచ్చబంగారానికి ధర దక్కేనా?

ఈసారి అధిక వర్షాలతో దుంపకుళ్లు సోకి పసుపు దిగుబడి తగ్గింది. ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు రావాల్సిన ఉండగా.. సగానికి తగ్గనుంది. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.0 / 16.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. చలి ప్రభావం అంతగా ఉండదు.

న్యూస్‌రీల్

ఆలయ హుండీ లెక్కింపు

ఖానాపూర్: పట్టణంలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవంలో భాగంగా జాతరకు భక్తులు సమర్పించిన కట్నకానుకల హుండీని బుధవారం లెక్కించారు. హుండీ ద్వారా రూ.2.75లక్షలు, కల్యాణోత్సవం ద్వారా రూ.34,570, కిరాణా సముదాయం ద్వారా రూ.34,470, సాయిబాబా దండ ద్వారా రూ.27,760, కొబ్బరికాయల వేలం ద్వారా రూ.65వేలు, లడ్డూ ద్వారా రూ.35వేలు వచ్చాయి. మొత్తం రూ.4.43లక్షల ఆదాయం సమకూరిందని ఆలయకమిటీ అధ్యక్షుడు అంకం రాజేందర్ తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రదీప్, శేఖరయ్య, శ్రీనివాస్, అశోక్‌రావు, రాజేశ్వర్, ప్రవీణ్, జితేందర్ తదితరులున్నారు.

టెండర్ల ఆహ్వానం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రత్యేక ఉప కారాగారానికి ఆహార పదార్థాలు సరఫరా చేసేందుకు టెండర్ నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ జిల్లా సబ్‌జైల్ అధికారి అశోక్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 25నుంచి ఫిబ్రవరి 3వరకు ఆదిలాబాద్ సబ్‌జైల్ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 4న టెండర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెండర్ దక్కించుకున్నవారు 1.4.2023 నుంచి 31.3.2024 వరకు కొనసాగుతారని తెలిపారు. పూర్తి వివరాలకు 9182215135, 8639893883 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కళాశాలకు హాజరు కావాలి

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం సెంటర్‌లో డిగ్రీ చదువుతున్న విద్యార్థులంతా ఈనెల 28, 29 తేదీల్లో కళాశాలకు రావాలని అధ్యయన కేంద్రం సమన్వయకర్త అజయ్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల పరీక్షలు, అడ్మిషన్లకు సంబంధించిన కొన్ని తప్పులను సరిదిద్దడానికి ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

మున్సిపల్ కమిషనర్ ఉదారత



వృద్ధులను ఆటోలో తరలిస్తున్న కమిషనర్

ఖానాపూర్: పట్టణంలోని ఒకటో వార్డు పరిధి గాంధీనగర్‌లో ఇటీవల ప్రారంభించిన కంటివెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. కాలనీ పరిధిలోని పలువురు వృద్ధులు ఇంటి నుంచి బయటకు రాని పరిస్థితి ఉండడంతో తన సొంత డబ్బులతో ఆటో ద్వారా వారిని కంటివెలుగు కేంద్రానికి తరలిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటివెలుగు శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాసర బాటలో...

భైంసా: వసంతపంచమి వేడుకలకు బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయం ముస్తాబైంది. గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించనుండగా ఇప్పటికే ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయం రంగురంగుల విద్యుద్దీపాల మధ్య శోభాయమానంగా వెలిగిపోతోంది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించారు. వీఐపీలు వచ్చినా సాధారణ భక్తులు ఇబ్బందులు పడకుండా దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు. తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలి రానుండగా పోలీస్‌శాఖ ప్రత్యేక దృష్టిసారించింది. స్నానఘట్టాలు, రైల్వేస్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో నిఘా పెంచింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తోంది.



విద్యుద్దీపాల కాంతిలో వెలిగిపోతున్న ఆలయం

- నేడు వసంత పంచమి వేడుకలు
- ముస్తాబైన జ్ఞానసరస్వతీ ఆలయం
- రాష్ట్రవ్యాప్తంగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు చేసిన ఆలయ సిబ్బంది

ఉచిత పార్కింగ్ వసతి

వేలాదిగా వచ్చే వాహనాలతో ఇబ్బందులు తలెత్తకుండా బాసర ఆలయ అధికారులు ఉచిత పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఆలయం తరఫున నిత్యాన్నదాన సత్రం వద్ద హరిహర కాటేజ్ సమీపంలో శ్రీరామలాడ్జి ఎదుట మూడు స్థలాలను ఎంపిక చేశారు. మూడు మార్గాల్లో వచ్చే వాహనాలు ఇక్కడ నిలిపి ఆలయం వైపు వెళ్లేలా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆలయం తరఫున ఉన్న మూడు ఉచిత పార్కింగ్ స్థలాలను సద్వినియోగం చేసుకోవాలని ఈవో విజయరామారావు భక్తులకు సూచించారు.

వేకువజామునుంచే..

బాసరలో వసంత పంచమి శుభముహూర్తాన వేకువజామునుంచే అక్షరాభ్యాస పూజలు జరగనున్నాయి. అక్షరాభ్యాస మండపంలో సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. వీఐపీలు వచ్చినా సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానికి భక్తులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని ముందస్తుగానే ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఆలయం తరఫున పాలు, పండ్లు పంపిణీ చేయనున్నారు. క్యూలైన్లలో నిరీక్షించే భక్తులకు తాగునీరు అందించేందుకు సిబ్బంది చర్యలు చేపట్టారు.

ప్రత్యేక నిఘా..

వసంత పంచమి ఉత్సవాల నేపథ్యంలో పోలీస్‌శాఖ ప్రత్యేక దృష్టిసారించింది. ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఎస్పీ కిరణ్‌ఖారే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. బాసర రైల్వేస్టేషన్, స్నానఘట్టాలు బస్టాండ్ తదితర ప్రాంతాల్లో నిఘాపెంచారు. ఆలయంలో అక్షరాభ్యాస మండపం, గర్భగుడి, ప్రధానద్వారం, టికెట్ల కౌంటర్, లడ్డూ ప్రసాద విక్రయకౌంటర్ వద్ద పోలీసు సిబ్బందిని ఉంచారు. ముథోల్ సీఐ వినోద్ కుమార్ సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. సిబ్బంది వెంటవెంటనే మైక్‌ల ద్వారా భక్తులకు సూచనలు చేస్తున్నారు. గోదావరి నది స్నానఘట్టాల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

ప్రత్యేక ఏర్పాట్లు

బాసరకు వచ్చే భక్తుల కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి వసంతపంచమి ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు. బాసర ఆలయ ఈవో విజయరామారావు, ఆలయ వైదిక బృందం సిబ్బందితో సమావేశమై భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు. ఆలయంలో ఇప్పటికే క్యూలైన్లు ఏర్పాటు చేశారు. టీటీడీ ఖాళీస్థలం, కోటి గాజుల మండపంలో తడకలతో చలువ పందిళ్లు వేశారు. భక్తులు ఇక్కడ కాసేపు విశ్రాంతి తీసుకునేలా ఏర్పాట్లు చేశారు.



ఇబ్బందులు లేకుండా చూస్తాం

రెండురోజుల నుంచి వసంతపంచమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బాసర ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం. వేలాదిగా వచ్చే వాహనాలకు ఆలయం తరఫున ఉచిత పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటుచేశాం. క్యూలైన్‌లో నిరీక్షించే భక్తులకు పాలు, పండ్లు పంపిణీ చేయనున్నాం. భక్తులకు పూర్తిస్థాయిలో ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– విజయరామారావు, ఆలయ ఈవో

కొనసాగుతున్న ఉత్సవాలు

- అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

భైంసా/ముథోల్: బాసరలో వసంత పంచమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. రెండోరోజైన బుధవారం ఆలయానికి భక్తులు తరలివచ్చారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. గంగమ్మతల్లికి పూజలుచేసి సూర్యేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి దర్శించుకున్నారు. అనంతరం సరస్వతీ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. చిన్నారులతో అక్షరాభ్యాస పూజలు జరిపించారు. ఆలయంలో పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు.

వెల్లివిరుస్తున్న ఆధ్యాత్మికం..

వసంతపంచమి ఉత్సవాల్లో భాగంగా బాసర ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుతున్నారు. గర్భగుడి, అక్షరాభ్యాస మండపాలను పూలతో అలంకరించారు. ఆలయ గోపురాలు, ప్రధాన ద్వారం, పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. రాత్రివేళ విద్యుత్ వెలుగుల మధ్య ఆలయం కొత్తశోభను సంతరించుకుంది. రెండు రోజులుగా బాసర గోదావరి నది వద్ద ఆలయ ప్రాంగణంలో అమ్మవారి నామస్మరణ మార్మోగుతోంది.

'బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి'

నిర్మల్‌చైన్‌గేట్: మూడు నెలల్లో పార్టీని బూత్ స్థాయిలో పటిష్టం చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు రావుల రాంనాథ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన బుధవారం మహబూబ్‌నగర్‌లో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశ వివరాలు వెల్లడించారు. మూడు నెలల్లో 11వేల గ్రామాల్లో శక్తి కేంద్రం వారీగా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేసే విధానాన్ని వివరించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఫిబ్రవరి మూడో తేదీ వరకు జిల్లా కార్యవర్గ సమావేశాలు, 6వ తేదీ వరకు మండల కార్యవర్గ సమావేశాలు, 9వ తేదీ వరకు శక్తి కేంద్రం వారీగా సమావేశాలు నిర్వహించేలా ప్లాన్ చేసుకున్నట్లు చెప్పారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసమ్మ రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అనుముల శ్రావణ్, బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తోట సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రావుల రాంనాథ్

ఓటుహక్కుపై అవగాహన కల్పించాలి



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖీ

నిర్మల్‌టౌన్: ఓటుహక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖీ సూచించారు. జిల్లా కేంద్రంలో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయం నుంచి జయశంకర్ సర్కిల్ వరకు విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. జయశంకర్ సర్కిల్ వద్ద విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. వారితో కలెక్టర్ ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కును వినియోగించుకుని దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్లు హేమంత్ బోర్కడే, రాంబాబు, ఆర్డీవో స్రవంతి, డీఈవో రవీందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీలో అపశ్రుతి



జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం కలెక్టర్ ముషరఫ్ ఫారూఖీ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన ర్యాలీలో అపశ్రుతి దొర్లింది. ఉదయం 8నుంచి 9వరకు నిర్వహించాల్సిన ర్యాలీని 10.30 గంటల దాకా కొనసాగించగా పాల్గొన్న వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. కలెక్టర్ కోసం ఎండలో నిల్చోగా ఓ విద్యార్థి సొమ్మసిల్లి పడిపోయాడు. అతడిని ఆస్పత్రికి తరలించారు. అధికారుల చర్యను విద్యార్థుల తల్లిదండ్రులు తప్పుపడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

'పునరావాస' లొల్లి



ఎఫ్‌ఆర్వోతో మాట్లాడుతున్న మైసంపేట్ వాసులు (ఫైల్)

- నిర్మాణ పనులపై అభ్యంతరం
- 25/30 సైజులోనే ఇళ్ల నిర్మాణం చేపట్టాలంటున్న నిర్వాసితులు
- లేకుంటే గ్రామాలను ఖాళీ చేయమన్న రాంపూర్, మైసంపేట్ వాసులు



పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే (ఫైల్)

కడెం: పునరావాసం కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న రాంపూర్, మైసంపేట్ వాసులకు నిరాశే ఎదురవుతోంది. గ్రామాలను తరలించి సకల సౌకర్యాలతో పునరావాసం కల్పిస్తామన్న అటవీ అధికారుల హామీలు అమలుకు నోచుకోవడంలేదు. వీరి మాటలు నమ్మి పులి మనుగడ కోసం ఉన్న ఊరు.. జాగా వదిలేందుకు రాంపూర్, మైసంపేట్‌వాసులు సిద్ధమయ్యారు. కానీ.. పునరావాస కాలనీలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తక్కువ సైజులో నిర్మిస్తుండడంతో మండిపడుతున్నారు. 25/30 సైజులో నిర్మించకుంటే గ్రామాలను ఖాళీ చేయబోమని తేల్చి చెబుతున్నారు.

నిర్మాణాలపై అభ్యంతరం

కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లోని కోర్ ఏరియాలోగల రాంపూర్, మైసంపేట్ గ్రామాలను ఖాళీ చేయించి మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామ సమీపంలోని అటవీ భూమిలో పునరావాస కాలనీ ఏర్పాటు చేయనున్న విషయం తెలిసిందే. 48 కుటుంబాలకు రూ.4.80కోట్లతో మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామ సమీపంలో ఐదు హెక్టార్ల విస్తీర్ణంలో విద్య, వైద్యం, విద్యుత్ తదితర అన్ని వసతులతో పునరావాస కాలనీ ఏర్పాటు చేయనున్నారు. ఈనెల 20న ఎమ్మెల్యే రేఖానాయక్ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈనెల 22న రాంపూర్, మైసంపేట్‌వాసులు నిర్మాణ పనులు పరిశీలించి అభ్యంతరం తెలిపారు. గతంలో చెప్పినట్లు 25/30 సైజులోనే నిర్మించాలని, లేకుంటే గ్రామాలను ఖాళీ చేయమని తేల్చి చెప్పారు. కాగా, అటవీ అధికారులు తాము బడ్జెట్ ప్రకారమే ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొంటున్నారు.

హడావుడిగా పనులు ప్రారంభం

ఉమ్మడి రాష్ట్రంలోనే మొదటిసారిగా ఇక్కడి అటవీ గ్రామాలను తరలించి పునరవాస కాలనీ నిర్మాణ పనులను హడావుడిగా ప్రారంభించారు. ఈనెల 20న ఎమ్మెల్యే రేఖానాయక్ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. స్థానిక మంత్రి, అటవీ అధికారులు లేకుండానే పనులను ప్రారంభించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. కనీసం తమకు కూడా చెప్పకుండా పనులు ప్రారంభించారని రాంపూర్, మైసంపేట్‌వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాలను ఖాళీ చేయం



అటవీ అధికారులు గతంలో చెప్పిన మాదిరిగా కాకుండా చిన్న సైజులో ఇళ్లు నిర్మిస్తున్నారు. చిన్న గది కట్టిస్తే ఒక మంచమే పడుతుంది. అలా కాకుండా 25/30 సైజులో ఇళ్లు నిర్మించాలి. లేకుంటే మా గ్రామాన్ని ఖాళీ చేయం.

– ప్రవీణ్, మైసంపేట్

ప్రత్యేక స్థలం కేటాయించాలి



ఆదివాసీలకు అనేక ఆచారాలుంటాయి. ఆచారం, సంప్రదాయాల ప్రకారం కాలనీ ఏర్పాటు చేయాలి. ఆలయాల నిర్మాణం చేపట్టాలి. ఇతర సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక స్థలం కేటాయించాలి.

– దేవురావు, మైసంపేట్

కమిటీ నిర్ణయం మేరకే..



కలెక్టర్ కన్వీనర్‌గా ఏర్పాటైన కమిటీ నిర్ణయం మేరకే ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. గ్రామస్తులతో కలిసి సమావేశంలోనూ చర్చించాం. ఇటీవలే రాంపూర్, మైసంపేట్ వాసులు అభ్యంతరం తెలిపారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– కోటేశ్వర్‌రావు, ఎఫ్‌డీవో, ఖానాపూర్

గణతంత్రానికి ముస్తాబు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

నిర్మల్: గణతంత్ర దినోత్సవానికి జిల్లా ముస్తాబైంది. గురువారం మువ్వన్నెల జెండా ఎగురవేసేందుకు సిద్ధమైంది. విద్యాసంస్థలు, కార్యాలయాలతో పాటు వీధుల్లోనూ జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. ప్రతీసారి జిల్లాకేంద్రంలో ఘనంగా జరిగే వేడుకలు ఈసారి కలెక్టరేట్‌కే పరిమితం కానున్నాయి. గతేడాది కోవిడ్ కారణంగా కలెక్టర్ కార్యాలయంలోనే నిర్వహించిన సర్కారు ఈసారి కూడా కలెక్టరేట్‌లోనే నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఏర్పాట్లను కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖీ, అడిషనల్ కలెక్టర్లు, అధికారులు పరిశీలించారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గతేడాది కరోనా కారణం చూపుతూ గణతంత్ర దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు.

కోవిడ్ ప్రభావం లేకున్నా..

ఈసారి కోవిడ్ ప్రభావం లేకున్నా.. ఇక్కడే ఏర్పాట్లు చేయడంపై జిల్లావాసులు పెదవి విరుస్తున్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వాలని చాలామంది విద్యార్థులు, చిన్నారులు ఎదురుచూశారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రోగ్రాంలో వాటన్నింటినీ ప్రదర్శించే అవకాశం, స్థలం లేకపోవడంతో నిరాశకు గురవుతున్నారు.

అమ్మవారికి ఇక్కత్ చీరెలు

భైంసా: వసంతపంచమిని పురస్కరించుకుని బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారికి ఇక్కత్ చీరెలు అందించారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లికి చెందిన చేనేత కళాకారులు మేకల రామకృష్ణ, రాజేశ్, పురుషోత్తం అమ్మవారి కోసం ప్రత్యేకంగా చీరెలు నేయించారు. అమ్మవారితోపాటు లక్ష్మీదేవీ, మహంకాళీ అమ్మవార్లకు చీరెలు తయారు చేశారు. వేదవ్యాసమహర్షికి పట్టుపంచ, శాలువాను రూపొందించి అందించారు. గురువారం అమ్మవార్లకు చీరెలు సమర్పించనున్నారు.



ఇక్కత్ చీరెలతో కళాకారులు

క్లుప్తంగా

గుప్తనిధుల కోసం తవ్వకాలు


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జైనథ్: మండలంలోని హత్తిఘాట్ గ్రామంలో గుప్త నిధుల తవ్వకాలు కలకలం రేపుతున్నాయి. హత్తిఘాట్ పంప్ హౌజ్ పక్కన చింత చెట్టు కింద విఠలేశ్వర స్వామి జెండా గద్దెను గుర్తు తెలియని వ్యక్తులు కూల్చి తవ్వకాలు చేపట్టడంతో గ్రామంలోని గిరిజనులు భయాందోళనకు గురవుతున్నారు. ఇక్కడ పూర్వీకుల పురాతన కట్టడాలు, పురాతన ఇండ్ల గోడలు, చుట్టుపక్కల దేవతల విగ్రహాలు ఉండేవని చెబుతున్నారు. కొన్నిరోజులుగా ఇక్కడ గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. కాగా సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించారు. ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అడవి జంతువులతో పాటు దొంగల నుంచి తమకు రక్షణ కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఇచ్చోడలో ఐదుగురు విద్యార్థులు డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ పరీక్షల్లో డిబార్ల పర్వం ఆగడం లేదు. ప్రతి పరీక్షలో పదుల సంఖ్యలో విద్యార్థులు డిబార్ అవుతూనే ఉన్నారు. తాజాగా బుధవారం జరిగిన పరీక్షలో ఇచ్చోడలో ఐదుగురు విద్యార్థులు కాపీ కొడుతుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకుని డిబార్ చేసినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ ఎర్రోల్ల నరేందర్ తెలిపారు. ఇచ్చోడలోని సాయి సమత్‌లో ముగ్గురు, కాకతీయ డిగ్రీ కళాశాలలో ఇద్దరు డిబార్ అయినట్లు పేర్కొన్నారు.

ఉరేసుకుని బాలుడి ఆత్మహత్య

తానూరు: ఉరేసుకుని బాలుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్సై బాను వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన డాకాజీ అనిల్ (16) గొర్రెలు కాసేందుకు తానూరులో పాలేరుగా పనిచేస్తున్నాడు. ఎల్వి గ్రామానికి చెందిన ఎగ్గాం రాజు శివారులో పంట చేనులో రెండు రోజుల క్రితం గొర్రెల మందను పెట్టారు. ఈ నెల 24వ తేదీన పొలంలో రాజు ఫోన్ అనిల్‌కు దొరికింది. ఆ ఫోన్‌ను తిరిగి రాజ్‌కు ఇచ్చాడు. అయితే బుధవారం మధ్యాహ్నం అనిల్ ఎల్వి గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ముగిసిన బేతల్ పూజలు

- మెస్రం వంశీయుల సంప్రదాయ పూజలు
- కొనసాగుతున్న నాగోబా జాతర
- తరలివస్తున్న భక్తజనం
- దర్శనానికి గంటల తరబడి క్యూలో..
- జనసంద్రంగా నాగోబా ఆలయం


నాగోబా ఆలయానికి మొక్కి బేతల్ పూజలు ముగిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: ఈ నెల 21న మహాపూజతో ప్రారంభమైన నాగోబా జాతర బుధవారం బేతల్ పూజతో సంప్రదాయ పూజలను ముగించారు. ముందుగా సంప్రదాయ వాయిద్యాలతో గోవడ్ ముఖద్వారం వద్దకు చేరుకున్న మెస్రం వంశీయులకు ఆ వంశం మహిళలు కాళ్లు కడిగి బేతల్ పూజకు ఆహ్వానించారు. మెస్రం వంశం మహిళలు, కొత్తకోడళ్లు బేటింగ్ అయ్యారు. సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తున్న ప్రధాన్ కితకు చెందిన మెస్రం వంశీయులకు కానుకలు అందించారు. మెస్రం వంశం పెద్దలు వెదురుకర్ర పట్టుకుని బేతల్ నృత్యాలు చేశారు. బేతల్ పూజలు ముగిసిన అనంతరం నాగోబాకు మొక్కి సంప్రదాయ పూజలు ముగించారు. అనంతరం గోవడ్ సమీపంలో సతిదేవత ఆలయంలో వచ్చిన కానుకాలను, ప్యాలాలను 22కితల వారీగా పంపిణీ చేశారు. రూ.లక్షా 29వేలు కానుకలు వచ్చినట్లు ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. ఈ సందర్భంగా మహా పూజలకు తీసుకొచ్చిన కొత్త కుండలను కితల వారీగా మెస్రం వంశీయులకు పంపిణీ చేశారు. వాటికి ఏడాది పాటు పూజలు చేయాలని సూచించారు. సాయంత్రం ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్ బుడుందేవ్ ఆలయానికి బయలుదేరారు. ఈ నెల 27న తెల్లవారుజమున బుడుందేవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి జాతరను ప్రారంభించనున్నట్లు మెస్రం వంశం పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో మెస్రం వంశం పెద్దలు మెస్రం బాదిరావ్ పటేల్, మెస్రం కోసు కటోడ, మెస్రం దేవ్‌రావ్, మెస్రం శేఖర్‌బాబు, మెస్రం సోనేరావ్, మెస్రం దాదారావ్, మెస్రం తిరుపతి ఉన్నారు.

కొనసాగుతున్న నాగోబా జాతర

నాగోబా జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గంటల తరబడి క్యూలో ఉండి దర్శ నం చేసుకుంటున్నారు. బుధవారం సైతం భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో నాగోబా ఆలయం జనసంద్రమైంది. ఈ నెల 28 వరకు జాతర అధికారికంగా కొనసాగుతుండగా అనాధికారికంగా 31 వరకు కొనసాగనుందని దేవదాయ శాఖ ఈవో రాజమౌళి తెలిపారు.


వెదురుకర్రను శుద్ధిచేస్తున్న మెస్రం మహిళలు


నాగోబా ఆలయంలో పూజలకు క్యూలో భక్తులు


కానుకలు వేస్తున్న మెస్రంవంశం మహిళలు, కొత్త కోడళ్లు


కాగడాలు వెలిగించి బేతల్‌పూజ ప్రారంభిస్తున్న ఆలయ పీఠాధిపతి

నాగోబాను దర్శించుకున్న ఏఆర్సీవో


పూజలు చేస్తున్న ఏఆర్సీవో, అధికారులు

ఇంద్రవెల్లి: నాగోబాను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల ఏఆర్సీవో మహేశ్వర్‌రావు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించా రు. నాగోబా ఆలయ, జాతర చరిత్రను మెస్రం వంశీయుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట లక్సెట్టిపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లలితాకుమారి, ఉపాధ్యాయులు సురేష్, స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపరాపు సత్యరాజ్ ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో ఆరుగురు సీఐలు బదిలీ

మంచిర్యాలక్రైం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పనిచేస్తున్న ఆరుగురు సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్‌స్టేషన్లో పని చేస్తున్న సీఐ బీ.శ్రీనివాస్‌ను నిర్మల్ రూరల్ సీఐగా, ఆదిలాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న కొంక మల్లేశ్‌ను నిర్మల్ టౌన్‌కు, రామగుండం సీఆర్‌బిలో పనిచేస్తున్న రాజ్‌కుమార్‌గౌడ్‌ను బెల్లంపల్లిరూరల్‌కు, నిర్మల్ రూరల్ సీఐగా పనిచేస్తున్న వెంకటేశ్‌ను మల్టీజోన్ వన్ కార్యాలయానికి, నిర్మల్‌టౌన్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఎన్.శ్రీనివాస్‌ను మల్టీజోన్ వన్ కార్యాలయానికి, బెల్లంపల్లి రూరల్‌లో పనిచేస్తున్న బాబురావ్‌ను రామగుండం సీసీఆర్బీకి బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

దీపాయిగూడలో దొంగల బీభత్సం

జైనథ్: మండలంలో అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామానికి చెందిన సురేష్ రెడ్డి, లింగన్న ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నలుగురు వ్యక్తులుగ్రామంలోకి చొరబడ్డారు. సురేష్ రెడ్డి ఇంటి తాళం పగలగొట్టి, బీరువాలోని 12తులాల బ గారం , రూ.20వేల నగదు ఎత్తుకెళ్లారు. కుటుంబ సభ్యులు వేరే గదిలో పడుకొని ఉండడంతో దొంగలు చప్పుడు చేయకుండా దొంగతనం చేసి వెళ్లిపోయారు. అనంతరం లింగన్న ఇంటి ఆవరణలో ఉన్న బైకును దొంగలించారు. ఉదయం లేచి చూడడంతో సురేష్ రెడ్డి ఇంట్లో బట్టలు చిందరవందరగా కనిపించడం, బీరువాలోని డబ్బులు, బంగారం లేకపోవడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. లింగన్న ఇంటి ఆవరణలోని బైక్ సైతం కనిపించకపోవడంతో ఎవరో దొంగలు పడ్డారని అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో క్లూస్ టీంతో కలిసి రంగంలోకి దిగిన పోలీసులు గ్రామంలోని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. సంఘటన స్థలంలో లభ్యమైన అన్ని ఆధారాలు సేకరించామని, దర్యాప్తు కొనసాగుతుందని, ఎవరు కూడా ఆందోళన చెందవద్దని ఎస్సై పెర్సిస్ బిట్ల తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

భార్యను కడతేర్చిన భర్త అరెస్టు

- తాగినమైకంలో ఘాతుకం..
- డబ్బులు ఇవ్వలేదని కోపంతోనే..
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ కిరణ్‌ఖారే


వివరాలు వెల్లడిస్తున్న భైంసా ఏఎస్పీ కిరణ్‌ఖారే

భైంసారూరల్: మద్యానికి డబ్బులు ఇవ్వకపోవడంతోనే ఈ నెల 19న భార్యను హత్యచేసిన నిందితుడిని బుధవారం అరెస్టు చేసినట్లు ఏఎస్పీ కిరణ్‌ఖారే తెలిపారు. భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించాడు. మండలంలోని దేగాం గ్రామానికి చెందిన సట్ల రమేశ్ మద్యానికి బానిసయ్యాడు. ఏ పనిచేయకుండా భార్య సురేఖను వేధిస్తూ డబ్బులు ఇవ్వకపోయేసరికి కోపం పెంచుకున్నాడు. సురేఖ బీడీ కంపెనీలో పనిచేస్తు ఇద్దరు పిల్లలను పోషిస్తుంది. రోజు మద్యం కోసం రమేశ్ వేధించేవాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో సురేఖపై కోపం పెంచుకున్నాడు. ఈ నెల 19 ఇంట్లో ఒంటరిగా ఉన్న భార్య సురేఖపై దాడికిదిగాడు. రోప్(దారం)తో గొంతు నులిమి కడతేర్చాడు. ఎవరికి అనుమానం రాకుండా ఇంట్లోనే మృతదేహం వదిలి బయటకు వచ్చి ఇంటి తలుపులు బిగించి తాళం వేయబోయడు. గమనించిన చుట్టు పక్కల వారు అలా ఎందుకుచేస్తున్నావని ప్రశ్నించడంతోనే రమేశ్ అక్కడి నుంచి పారిపోయాడు. సురేఖ తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని రంగంలోకి దిగిన పోలీసులు రమేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. హత్యచేసినట్లు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో భైంసారూరల్ సీఐ చంద్రశేఖర్, ఎస్సై శ్రీకాంత్ ఉన్నారు.

'గిరి' విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి


విద్యార్థులను అభినందిస్తున్న పీవో వరుణ్‌రెడ్డి

ఉట్నూర్: గిరిజన విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఇటీవల రంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ హాకీ క్రీడల్లో ద్వితీయ స్థానం సాధించిన గిరిజన క్రీడా పాఠశాల, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులను డీడీ దిలీప్‌కుమార్‌తో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ రాష్ట్రస్థాయి హాకీలో ద్వితీయ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. జట్టులో 14 మంది ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ఉండడం, ఆ జట్టు రాష్ట్ర స్థాయిలో గెలుపొందడం అభినందనీయమన్నారు. ఉట్నూర్‌లో ప్రత్యేక హాకీ క్రీడా మైదానాన్ని రెండు నెలల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. క్రీడాకారులకు ఐటీడీఏ ద్వారా పూర్తి స్థాయి సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. క్రీడాకారులకు ప్రత్యేక డైట్‌తో పాటు హాకీ స్టిక్స్, క్రీడా దుస్తులు అందిస్తామని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను భువనేశ్వర్‌లో జరుగుతున్న ప్రపంచ హాకీ క్రీడా పోటీలను తిలకించేందుకు పంపించాలని డీడీని ఆదేశించారు. అనంతరం రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఏటీడీవోలు క్రాంతి, నిహారిక ప్రధానోపాధ్యాయులు ఉత్తమ్, శ్రీనివాస్, మధుసూదన్, హేమంత గోవింద్, కోచ్‌లు శేఖర్, సునంద్, శివ పాల్గొన్నారు.

పత్తి రైతులు, కూలీల జీవితాల మెరుగుకు ఐఎల్‌వో కృషి


మాట్లాడుతున్న అసోసియేట్ అపూర్వ

ఎదులాపురం: పత్తి రైతులు, దాని అనుబంధంగా పనిచేస్తున్న కూలీల జీవితాలు మరింతగా మెరుగు పర్చడమే లక్ష్యంగా ఐఎల్‌వో కృషి చేస్తున్నట్లు ఇంటర్‌నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌వో) సీనియర్ రీసెర్చ్ అసోసియేట్ (ఢిల్లీ) అపూర్వ అన్నారు. జిల్లాలో ఐఎల్‌వో ఆధ్వర్యంలో చేపట్టిన ఫండమెంటల్ ప్రిన్సిపల్ అండ్ రైట్స్ ఎట్ వర్క్ (ఎఫ్‌పీఆర్‌డబ్ల్యూ) ప్రాజెక్టు సాధించిన పురోగతిని తెలుసుకునేందుకు తాను పరిశీలనకు వచ్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లాలో దాదాపు 100కు పై గ్రామాల్లో ఐఎల్‌వో ప్రాజెక్టు చేపట్టిందన్నారు. పత్తి రైతులు, దాని అనుబంధంగా పనిచేస్తున్న కూలీలకు వారి హక్కులు, వారికి దక్కాల్సిన సంక్షేమాభివృద్ధి ఫలాలను వివరించడం జరిగిందన్నారు. వారి జీవితాలను మెరుగు పర్చడమే తమ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఇటీవలే ఎఫ్‌పీఆర్‌డబ్ల్యూ ప్రాజెక్టు ఆదిలాబాద్‌లో ముగిసిందన్నారు. అనంతరం మండల కోఆర్డినేటర్లతో పలు అంశాలపై చర్చించారు. ఐఎల్‌వో ద్వారా చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి, ఐఎల్‌వో జిల్లా కోఆర్డినేటర్ ఎస్.విలాస్, ఏఐటీయూసీ నాయకులు కుంటాల రాములు, సిర్ర దేవేందర్, గాజంగుల రాజు ఉన్నారు.

అటవీశాఖ సిబ్బంది దాడి


ఎఫ్‌బీవోను నిర్బంధించిన గ్రామస్తులు

నార్నూర్: మండలంలోని నాగల్‌కొండం గొండుగూడ గ్రామానికి చెందిన కొవలింబారావు అనే వ్యక్తిపై బుధవారం అటవీశాఖ సిబ్బంది దాడిచేసిన సంఘటన చోటుచేసుకుంది. లింబారావు కట్టెల కోసం అడవికి వెళ్లినట్లు సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది నాగల్‌కొండ అటవీ ప్రాంతానికి వెళ్లి అతడిపై దాడి చేశారు. దీంతో బాధితుడు గ్రామానికి తిరిగి వచ్చి జరిగిన విషయాన్ని తెలిపాడు. దీంతో గ్రామస్తులు నిరసనకు దిగారు. అధికారుల దాడి విషయాన్ని తెలుసుకున్న బీట్ అధికారిణి కళ్యాణి బాధితుడిని పరామర్శించేందుకు గ్రామానికి చేరుకుంది. దీంతో గ్రామస్తులు ఘెరావ్ ఆమెను చేశారు. దాదాపు 3గంటల పాటు నిర్బంధించడంతో కల్యాణి పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్సై మహేందర్ సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పారు. అప్పటికే నిరసించిన బీట్ అధికారిణి కళ్లు తిరిగి పడిపోవడంతో ఆమెకు ప్రథమ చికిత్స అందించి ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు. అలాగే బాధితుడు లింబారావుకు రక్తపోటు అధికం కావడంతో ఉట్నూర్ తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆదిలాబాద్ రిమ్స్‌కు రెఫర్ చేశారు. బాధితుడి భార్య కోవ రాధాబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

కాగజ్‌నగర్‌టౌన్(సిర్పూర్): పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీకి చెందిన పి. పుష్పలత (30) మంగళవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై డి.చంద్రశేఖర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంటకు చెందిన పుష్పలతకు కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న కాగజ్‌నగర్‌కు చెందిన రమేశ్‌తో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా భర్త రమేశ్‌తో పాటు కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేసేవారు. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నూతన నియామకం


కె.శ్రీనివాసాచారి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ఆస్పత్రిలో ఫార్మాసిస్ట్ గ్రేడ్–1గా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాసచారి రెండోసారి తెలంగాణ రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రెటరీగా ఎన్నికయ్యారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన నాల్గోవ రాష్ట్ర మహాసభలో రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సత్యనారాయణరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


కాలిపోయిన ఇంటి సామగ్రి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మివాడలో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గుమ్మిడేల రోషన్ పట్టణంలోని మారుతి షోరూంలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి మూడు నెలల కిందట వివాహమైంది. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన స్థానికులు నీటితో మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని సామగ్రి ఖాళీ బూడిదైంది. సుమారు మూడు లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.